# శేషమ్మ

శేషమ్మకి యీ లోకంలో ఏ మాత్రమూ ఆనందమూ సౌందర్యమూ కనపడడం మానేసి ముప్పై యేళ్ళయింది. ఇతరులు నవ్వుతున్నా, తింటున్నా, పాడుతున్నా, ఆమెకి విచారమో లేక, అసహ్యమో కలుగుతుంది. పిట్టలకూతలూ, పిల్లల నవ్వులుకూడా ఆమెని "ఇరిటేట్" చేస్తున్నాయి.

"పాడుపిట్టలు – పనిలేదు వీటికి. వెధవ అరుపులూ, గోలలూ, అంతకన్న చస్తేనేం?"

ఆమెకి ప్రపంచం దుఃఖమయం, పాపభూయిష్టం, అపవిత్రం. దీన్నంతా విడిచిపోవాలని, మృత్యుని తలుచుకుని అందరూ వినేట్టుగా ఆహ్వానిస్తూవుంటుంది. "ఆ ఈశ్వరుడు యెప్పుడు దయతలుస్తాడో, ఎప్పుడు పిలిపించుకుంటాడో, యీ నరకంలోంచి నన్ను!"

ఆ ఈశ్వరుడు తన తండ్రిలాగూ, తనని భూలోకమనే అత్తవారింటికి పంపినట్టూ మాట్టాడుతుంది. నాలుగేళ్ళ క్రిందట కలరా తగిలి నప్పుడు మాత్రం—

"ఒరే చస్తానురా. చస్తానురా. డాక్టరేమన్నాడూ ? ఆస్పత్రి పెద్ద డాక్టర్ని పిలుచుకురా. ఆ పెరుగు తోడుకుందో లేదో చూచావుటే. మా అమ్మ యెనభై యేళ్ళు బతికిందిరా. ఇంత చిన్నదాన్ని నా కప్పుడే యేం చావు ? అవునులే ఈ ముసలిముండ చస్తే ఎవరికేం ? అందరికీ పీడ విరగడై పోతుంది" అంది మళ్ళీ.

ఆమె మొహాన నవ్వు చూసిన వాళ్ళెవరూ లేరు. చిన్నపిల్లలు

గంతులేస్తోవుంటే, "ఈ గంతు లేన్నాళ్ళు ? మీ కాళ్లు విరగా. ఇదేం పోయేకాలంరా. సరిగా కూచుని యాడవలేరూ?" అన్నట్టు చూస్తుంది. ఎంత విచారంగా కనపడితే యీ లోకంమీద, యీ మాయమీద ఎంత అసహ్యం కనపరిస్తే, ఎంత సౌందర్యాన్ని ద్వేషిస్తే ఈశ్వరుడికి అంత సన్నిహితురాలూ, ప్రియతమురాలూ అయివుంటుంది. యీ లోకంలో తనవంటి సన్మార్గులకు కష్టాలు తప్ప యింకేమీ లేవుకనక సుఖపడే వాళ్ళంతా దుర్మార్గులే ఐవుండాలి. తను కష్టాలకోసం ఎంత ప్రయత్నించి పిరుకుంటుందో ఆమెకి తెలీదు.

"అదేమిటి ఆ కామాక్షి అట్లా పాడుతోవుంటుంది. యెప్పుడూ ! దేన్ని చూసుకుని ! మొగుడి వుద్యోగం వూడినప్పుడు తెలుస్తుంది, అమ్మగారి అదిరిపాటు!"

ఆమెని "యెట్లా వున్నారమ్మా !" అని అడిగితే యెప్పుడూ "బాగానేవున్నా" వని అనలేదు. అసలు యీ దేశంలో ఆ మాట అనేవాళ్ళే తక్కువ. నిజంగా బాగా వుండేవాళ్ళే తక్కువ. బాగా వున్నాకూడా, బాగా వున్నామని తెలుసుకున్నవాళ్ళు చాల తక్కువ. తెలుసుకున్నా, "బాగా వున్నా" మని అంటే దిష్టి తగిలి, అదృష్టం మారుతుందని ఆ మాటలనరు అంతేకాక బాగా వుండడం దోషమనీ, పాపాత్ములే బాగా వుంటారనీ, మూర్ఖులు మాత్రమే బాగా వున్నామనుకుంటారనీ నమ్మకం.

"ఏం బాగుండడమమ్మా ! కుర్రాడికి నిన్నటినుంచి జలుబు కదా ! ఇంతవరకు కన్ను తెరచి యెరుగడు. ఆవు పాలివ్వడం మానేసింది. మొన్ననేగా మా తాతగారి సవితితల్లి మేనమామ పోయినాడు. వాడి మనుమడు మూడోక్లాసు తప్పిపోయినాడా! రాచ్చిప్ప బిల్లిపడ్డది. నిక్షేపంలాంటి రాచ్చిప్ప! ఇట్లావుంది మాగతి ఏమోనమ్మా ఈ కాలంలో అంతా మాయ మాయరాచ్చిప్పలూ! మాయ మనుషులూ! అవునులే అమ్మా! ఏం శాశ్వతం? ఈ దేహమూ అంతేకద, వూరికే పట్టుకు పాకులాడుతారు గాని"

ఈ వాక్యాలే ఏ దేశాభిమాని ఐనా విన్నాడా, అక్కడే మూడు పల్టీలు కొట్టి, "హా భారతమాతా! ధన్యురాలివి, ఇట్లాంటి ఆధ్యాత్మికులైన ముసలమ్మల్ని కన్నావు" అని ఆనందంలో మూర్ఛపోతాడు.

ఎవరన్నా - "అదీ, ఆ రత్తమ్మ! మొన్నరాత్రి పారిపోయిందటమ్మా!" అంటే - శేషమ్మ - "ఛీ, ఛీ, అట్లాండి మాటలు నా చెవిని పడనీకు. నా కెందుకూ? నా రామనామమేమో, నేనేమో! ఇంతకీ యెవడితో?"

"అక్కయింటికి"

"ఇంతేనా ? పారిపోయిందంటావేం?"

"ఏమో వాళ్ళంటే నే నన్నాను"

కొంచెం ఆగుతుంది శేషమ్మ ఇంకా యేమన్నా చెపుతారేమోనని. చెప్పకపోతే –

"నా కెందుకమ్మా! కానీ అక్కయింటికి ఎవరు తీసుకెళ్ళారూ? ఎవడో మొగాడు వుంటాడు. బాగా చూడమను. వాతలు పెడితే యిద్దర్నీ పట్టుకుని – నా కెందుకులే. వద్దన్నా నా కెందుకు చెపుతావు ! అక్కయింటికి వెళ్ళిందో. ఇంకెక్కడికి వెళ్ళిందో! ఆ అక్క సంగతి తెలుసుగా! దాని షోకులూ, రవ్వల దుద్దులూ - నా కెందుకమ్మా ! బండెడు చాకిరీ ! చస్తున్నాను"

"మీ కోడలు పని చెయ్యదా?"

"అయ్యో దాని చేతులు పువ్వులట, దాని కాళ్ళు తామరాకులట !"

"మీ కూతురో?"

"మా కూతురికి గంపెడు రోగమమ్మా! అదేం చేస్తుంది, దాని ముఖం!"

"అట్లానమ్మా! బాగానే తిరుగుతోవుంటుందే!"

"మీ కంటికి అట్లానే కనపడుతుంది. పైపు పుస్తేగానీ లోపలింతా గుల్ల. ఒకటే ఆయాసం"

"మరి ఎప్పుడూ అలా చిరుతిళ్ళు తింటే—"

"అయ్యో యేం తింటుంది? అన్నం అసలే తినదు. ఆ చిరుతిళ్ళు కూడా లేకపోతే ఎట్లా?"

"మా కూతురమ్మా, మా సుబ్బలక్ష్మి! దానికొక్క రోజు జబ్బు చెయ్యదుకదా!"

"చెయ్యకేమమ్మా! అట్లా తిరిగేవాళ్ళు గభాలున పడతారు. మామామ మనుమడు అంతే, పిడిరాయి లాగు—"

శేషమ్మ ప్రపంచం పనీ, ఆచారమూ తెల్లవారకట్ట నాలిగింటికి లేచి, రాత్రి పదకొండింటివరకు (మధ్యాహ్నం రెండు గంటలు విశ్రాంతితో) పనిచేయడం, ముప్పై యేళ్ళనించి. ప్రతి దినమూ ఆ విధంగా పనిచేస్తోంది. ఆమె పని చేసినంత సేపూ, ఆమె నోరు పనిచేస్తోవుంటుంది. మాటలతో తిట్లతో తెల్లవారకట్టే రాత్రి అల్లరిచేసిన పిల్లల్ని, యెలికల్ని తిట్లు, తరవాత పదింటిదాకా దాసీదాన్ని తిట్లు, అల్లరి చేసే పిల్లల్ని కాకుల్ని తిట్లు. కానీకి వీశడు బీరకాయ లివ్వని కూరలదాన్నీ, మజ్జిగదాన్నీ తిట్లు. ఈ ముప్పై యేళ్ళలోనూ ఒక్కరోజుకూడా చిక్కని మజ్జిగ పొయ్య లేదు కదా ఒక్క గొల్లదికూడా, పుచ్చుపోని కూరలివ్వలేదుకదా ఒక్క కూరలవాడా కూడా? మధ్యాన్నించి యిరుగు పొరుగు వాళ్ళనీ, కోడల్నీ, కొడుకు అనాచారాన్నీ కృతఘ్నతనీ, దేవుణ్ని, పిచికల్ని, తోవపొయ్యే వాళ్ళనీ తిట్టుకోడం ప్రారంభిస్తుంది. పని చెయ్యలేకుండా వుండలేదు. అదే ఆమె మతం, ఆమె శరీరమే పనిచేసే మర అయిపోయింది. ఆమె "ఇంటెలిజిన్స్" ఎప్పుడో మానింది పనిచెయ్యడం. "రొటీన్" తప్ప ఇంకేమీ ఆమె చేతకాదు. ఒక్కరవ్వ ప్రోగ్రామ్ మారిందా యిల్లు పడుకుంటుంది. అంట్లశుభ్రం, యిల్లు కడగడం, పేడచల్లడం, మెతుకులూ, ఎంగిలీ

మైలమైల అరవడం యిదే బతుకు? ఒక కొత్తపనీ, కొత్తయోచనా రెండూ ఆమె చాతకావు. గానుక్కి కట్టిన యెదునయం. అందువల్లనే మార్పు అంటే గుండెలు పగిలి చస్తారు. బెత్తం లేకుండా పాఠం చెప్పమంటే, ముసలి స్కూలు మాష్టరికి యెట్లా వుంటుందో, యింగువ లేకుండా వంట చెయ్యమంటే ఆమెకట్లా వుంటుంది. ఛేపు లేకుండా పని చెయ్యమంటే తాలూకా గుమస్తాకి యెట్లా వుంటుందో మడికట్టుకోకుండా వండమంటే ఆమె కట్లా వుంటుంది. ప్రపంచం ముక్కలైనా ఆమెకి ఆశ్చర్యం కలగదు. ఇంతపని యిన్నేళ్ళు చేసిందా యెవరికా వుపయోగమంటే యేమీ కనపడదు. అందరూ ఆమెని చూసి విసుక్కునేవాళ్లేగాని కృతజ్ఞత కనుపరిచే వాళ్ళులేరు. నలుగురికి భోజనం పెడుతోంది. తను తింటోంది. ఇంటిని మురికిచేస్తుంది, ఎందుకు? కడగడానికి. కడగడ మెందుకు? మళ్ళీ మురికి చెయ్యడానికి. అంతకాలం వంట చేస్తే మూడువందల మందికి భోజనం పెట్టవచ్చు వొక మనిషి. స్వర్గంలో అంట్లు తోమడమూ, బట్టలారవెయ్యడమూ లేకపోతే యేం చేస్తుందో యీ మనిషి!

పాపం, ఏ కొత్త కాంతినీ, ఆశనీ, ఆనందాన్నీ, కోర్కెనీ, అన్నిటినీ త్యజించి, ఆ వంటిల్లే తన ప్రపంచంగా తన బాధే తన ఆనందంగా, తన చేతికి చిక్కిన అయిదారుగురు దాసీలతో సహా, తన నోటి తీటను తృప్తి పరచగల సాధనాలుగా, తన ఆచారాన్నీ, తులసికోటని చూసుకుని గర్వపడి బతుకుతోంది. భూకంపాలు రానీ, దేశాలు దేశాలు తగలపడనీ, సామ్రాజ్యాలు పడిపోనీ, ఆమె కేమీ సంబంధంలేదు - తన యింటికి వంద గజాలు దాటి ఆమె మనసు పనిచెయ్యదు.

కాపురము, పిల్లలు, ప్రేమ, ఏమీ లేక తనవి, స్వతంగా తనవి అనే ఆస్తిగాని మనిషిగాని లేక, క్రమంగా క్రమంగా మనసు మొద్దైపోయి విరిచింది ఆమె. ఇంకే ఆసక్తీలేక ఆ పాత పురాణాలలో విన్న అక్కడక్కడి వచనాలని పట్టుకుని, వాటి వాస్తవత్వంపైన తన ఆత్మ పురోభివృద్ధిని ఆధా

రంగా చేసుకుని కన్నంలో యెలికవలె బతుకుతోంది ఎవరికైనా ప్రేమించడం కన్న ద్వేషించడం సులభం. ప్రేమ మనిషిని తన స్వంతంగా చేసుకోవాలని ప్రయత్నిస్తుంది. ఈ పేద వితంతువు స్వంతం కావడానికి ఎవరంగీకరిస్తారు? తన కోడలికి ఒక్కొక్క బిడ్డే పుడుతోవుంటే తన స్వంతం చేసుకోవాలని చూసింది. ఆ తల్లి ప్రతి నిమిషమూ జ్ఞాపకం చేసేది ఆ పిల్ల తనదని - చూపుచాతా, నడవడిచాతా. ఆ పిల్లలే మూడేళ్ళు రాగానే అందరి కన్న లోకువ గనక కర్రలు తీసుకుని బాదేవారు ఆమెని. ప్రేమలేక, సంతోషంలేక, జీవితంలో యింటరెస్టులేక, తను ఏ బాధపడ్డా కరుణించేవారు లేక, ఇంక విధిలేక యీ బండ చాకిరిలో తన శక్తినీ, ద్వేషంలో తన ప్రేమనీ, తిట్లలో తన ఆనందాన్ని సార్థకం చేసుకోవాలని ప్రయత్నిస్తుంది. ఇట్లా ఎందరు ఎందరు యీ దేశంలో యిట్లా కాయ్యబారిన ఆత్మలతో తమ జీవితాన్నీ యితరుల జీవితాన్నీ క్షోభపెట్టి చివరికి మృత్యువులో తప్పించుకునే స్త్రీలు! కానీ మృత్యువులోనైనా తప్పించుకుంటారా? వాళ్ళ జన్మలో వుందా యీ లోపం, వాళ్ళ నిట్లా చేసిన సంఘం పరిస్థితులలో వుందా? వాళ్ళు సంఘానిట్లా ఎండపెడుతున్నారా, సంఘం వాళ్ళని కాయ్యల్ని చేస్తోందా?